# కేజీబీవీలో అడ్మిషన్లు ఫుల్

- జిల్లాలో 19 కేజీబీవీ పాఠశాలలు
- సీటు దొరక్క వెనుదిరుగుతున్న పిల్లల తల్లిదండ్రులు


రాజంపేటలోని కేజీబీవీ పాఠశాల

రాజంపేట : గ్రామీణ ప్రాంతాల్లో బాలికలకు నాణ్యమైన విద్యను అందించాలనే ఉద్దేశంతో కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయాలు (కేజీబీవీ) ఏర్పాటు చేశారు. జిల్లాలో 19 కేజీబీవీలు ఉండగా వీటిలో రాజంపేట కేజీబీవీతో పాటు ఇతర కేజీబీవీల్లో ఇంగ్లిష్ మీడియంలో బోధిస్తుండటంతో సీట్ల కోసం డిమాండ్ ఎక్కువగా ఉంది. ఇటీవల పదోతరగతి ఫలితాలలో ఇద్దరు విద్యార్థులు 9.7 జీపీఏ సాధించారు. రెండు నెలల నుంచి తమ పిల్లలను కేజీబీవీ పాఠశాలలో చేర్పించేందుకు పిల్లల తల్లిదండ్రులు పాఠశాలల చుట్టూ తిరుగుతున్నా ప్రయోజనం లేదని వారు వాపోతున్నారు. రాజంపేట కేజీబీవీతో పాటు ఇతర కస్తూర్బా పాఠశాలలో ఇప్పటికే అడ్మిషన్లు పూర్తయ్యాయని ఉపాధ్యాయులు చెబుతున్నారు. రాజంపేటలో ఆరు నుంచి పదో తరగతి వరకు 200 మందికి అడ్మిషన్లకు అనుమతి ఉండగా ఇప్పటికే 244 మందికి పైగా చేరారు. రోజూ పదుల సంఖ్యలో విద్యార్థుల తల్లిదండ్రులు అడ్మిషన్ కోసం వచ్చి సీటు దొరక్క వెనుదిరుగుతున్నారు. మరిన్ని సీట్లు పెంచాలని పలువురు పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు.

### సీట్లు ఖాళీ లేవు



రాజంపేట కేజీబీవీలో ఇప్పటికే అన్ని తరగతుల్లో అడ్మిషన్లు నిండిపోయాయి. పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యం 200 ఉంటే ఇప్పటికే 244 విద్యార్థులు అడ్మిషన్లు తీసుకున్నాం. అడ్మిషన్ల విషయంలో ఎవరూ ఒత్తిడి చేయవద్దని కోరుతున్నాం. – శ్రీవాణి, స్పెషల్ ఆఫీసర్

## త్వరగా యూనిఫాంలను అందించాలి


యూనిఫాంను పరిశీలిస్తున్న ఎంపీడీవో బషీరుద్దీన్


లింగంపేటలో..

బాన్సువాడ రూరల్ : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు ఉచితంగా అందించే యూనిఫాంలను తయారీని పూర్తిచేసి అందించాలని బాన్సువాడ ఎంపీడీవో బషీరుద్దీన్ సూచించారు. గురువారం ఆయన మండలంలోని బోర్లంక్యాంప్, దేశాయిపేట్ తదితర గ్రామాల్లో పర్యటించారు. జీపీ కార్యదర్శులు సాయికుమార్, రవి ఉన్నారు.

**లింగంపేటలో..**

లింగంపేట(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని బాలికల ప్రాథమిక పాఠశాలలో గురువారం ఎంపీపీ గరీబున్నిసాబేగం ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో నరేష్, మండల విద్యాధికారి రామస్వామి, హెచ్ఎం సూరయ్య, ఏపీఎం శ్రీనివాస్ తదితరులున్నారు.

### ప్రభుత్వ కళాశాలలో చేర్పించండి



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : ఇంటర్ చదువు కోసం మీ పిల్లలను నాగిరెడ్డిపేట మండలకేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేర్పించాలని కళాశాల సిబ్బంది సూచించారు. కళాశాల ఏర్పాటుకు సంబంధించి పలువురు అధ్యాపకులు గురువారం నాగిరెడ్డిపేట మండలంలోని వదల్‌పర్తి, మాల్తుమ్మెద గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోటుబుక్కులను అందజేస్తామని వారు చెప్పారు.

### కొనసాగుతున్న బడిబాట కార్యక్రమం



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలో గురువారం తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ తీశారు. హెచ్ఎం కల్యాణి మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి ప్రభుత్వ పాఠశాలలో చదవాలని, ప్రభుత్వ పాఠశాలలో అన్నిరకాల సౌకర్యాలు ఉన్నాయన్నారు. ఉపాధ్యాయులు నర్సారెడ్డి, శ్రీకాంత్, రాజాగౌడ్, రాజులు, రాజశేఖర్, జనార్దన్, కళాకారులు రమేశ్‌రావు తదితరులున్నారు.

## స్టాఫ్‌నర్స్‌లను నియమించాలి


సమావేశంలో పాల్గొన్న కమిటీ సభ్యులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : నాగిరెడ్డిపేట పీహెచ్‌సీలో నెలకొన్న స్టాఫ్‌నర్స్ కొరతను తీర్చాలని రోగి కల్యాణ్ సమితి సమావేశంలో తీర్మానించారు. నాగిరెడ్డిపేట పీహెచ్‌సీలో గురువారం రోగి కల్యాణ్ సమితి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. పీహెచ్‌సీలో నలుగురు స్టాఫ్‌నర్స్‌లు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం ఒక్కరు మాత్రమే ఉన్నారని వైద్యుడు సృజన్ కమిటీ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో జెడ్పీటీసీ మనోహర్‌రెడ్డి జిల్లా వైద్యాధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి నాగిరెడ్డిపేట పీహెచ్‌సీలో స్టాఫ్‌నర్స్‌లను నియమించాలని కోరారు. దీంతోపాటు పీహెచ్‌సీలో నీటికొరత ఉందని, నీటికొరతను తీర్చేందుకు మిషన్ భగీరథ నీటిని సరఫరా చేయాలని సిబ్బంది కోరారు. ఈ సమావేశంలో ఎంపీపీ వినీతరెడ్డి, ఎంపీహెచ్‌వో రామారావు, సూపర్‌వైజర్లు సునంద, శాంతిశ్రీ, సీనియర్ అసిస్టెంట్ కరీముల్లా, ఎంపీహెచ్ఏ మురళి పాల్గొన్నారు.

## వృత్తి నైపుణ్యత పరీక్షలు


వృత్తి నైపుణ్య పరీక్షలో పాల్గొన్న మత్స్యకారులు

లింగంపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని మెంగారం గ్రామ ఊర చెరువులో మత్స్యకారులకు వృత్తి నైపుణ్య పరీక్షలు చేసినట్లు జిల్లా మత్స్య శాఖ అధికారి వరదరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మత్స్యకారులకు వల విసరడం, ఈత కొట్టడం, పాండి గుంజడం పరీక్షలు చేసినట్లు తెలిపారు. ఈ పరీక్షలల్లో 37 మంది మత్స్యకారులు పాల్గొన్నారు. చెరువులో దిగినప్పుడు ఆపద వస్తే ఎలా తనను తాను రక్షించుకోవాల్లో అవగాహన ఉండాలన్నారు. అనంతరం చైర్మన్‌ను మత్స్యకారులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యకారుల సహకారం సంఘం చైర్మన్ సత్యనారాయణ, ఆడిటర్ శ్రీనివాస్, బట్టు విఠల్, రాజు తదితరులున్నారు.

### కానిస్టేబుళ్ల బదిలీ



రాజంపేట : రాజంపేట మండల పోలీస్ స్టేషన్ పరిధిలో పనిచేస్తున్న నలుగురు కానిస్టేబుళ్లు బదిలీ అయినట్లు ఎస్సై సంపత్ తెలిపారు. రమేశ్‌రెడ్డి, దేవేందర్ లింగంపేట పోలీస్‌స్టేషన్‌కు, సాయిలు ఎల్లారెడ్డికి, రమేశ్ దోమకొండ పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయినట్లు ఎస్సై సంపత్ తెలిపారు. ఈ సందర్భంగా బదిలీ అయిన వారిని సన్మానించినట్లు తెలిపారు.

### పోలీసు సిబ్బందికి సన్మానం



ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి పోలీస్‌స్టేషన్‌లో విధులను నిర్వర్తించి బదిలీపై వెళ్తున్న పోలీసు సిబ్బందిని సీఐ రవీందర్‌నాయక్, ఎస్సై మహేశ్ గురువారం సన్మానించారు. పీఎస్‌లో విధులను నిర్వర్తించిన హెడ్ కానిస్టేబుల్ రాధాకృష్ణ, పీసీలు సంపత్, మహేష్, రాములను సీఐ, ఎస్సైలు శాలువా, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో ఏఎస్సై నర్సింగ్‌రావు, సిద్ధిఖీ, సిబ్బంది తదితరులున్నారు.

### నియామకం



కామారెడ్డి టౌన్/ కామారెడ్డి క్రైం : రాష్ట్ర ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శిగా కామారెడ్డి జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోలా శ్రీకాంత్ గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యా రు. గురువారం హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశం, నూతన రాష్ట్ర కమిటీ ఎన్నికల్లో శ్రీకాంత్‌గౌడ్‌ను ఎన్నుకున్నారు.

### ఆధ్యాత్మికం

**ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం**



పిట్లం(జుక్కల్): మండల కేంద్రమైన పిట్లంలోని సాయిబాబా ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గురువారం సాయిబాబా ఆలయం 10వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఉదయం నుంచి భక్తులు ఆలయంలో అభిషేకాలు, అర్చనలు, కాకడ హారతి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

**సాయి ఆలయంలో భక్తుల సందడి**

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండలంలోని నెమ్లిలో ఉన్న షిర్డీసాయి ఆలయంలో గురువారం భక్తుల సందడి నెలకొంది. ఉదయం ఖాగడ హారతి, మధ్యాహ్నం అన్నదానం, సాయత్రం పల్లకీసేవ కార్యక్రమాలను నిర్వహించారు.

## మిషన్ భగీరథ నీళ్లొస్తున్నాయా..?


మద్నూర్‌లో సర్వే నిర్వహిస్తున్న అధికారులు


బీబీపేటలో..

మద్నూర్(జుక్కల్) : మిషన్ భగీరథ నీళ్ల వస్తున్నాయా.. నీటి కులాయిల మరమ్మతులు ఉన్నాయా..? అని పంచాయతీ అధికారులు సర్వే నిర్వహించారు. మండల కేంద్రంలో గురువారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీ కార్యదర్శి సందీప్, జీపీ సిబ్బంది ఇంటింటికీ తిరిగి మిషన్ భగీరథ నీటి సరఫరాపై సర్వే నిర్వహించారు. గతంలో మిషన్ భగీరథ సిబ్బంది ప్రతి ఇంటికి కులాయిల కనెక్షన్ ఇచ్చారని అవి ప్రస్తుతం ఎలా పనిచేస్తున్నాయని సర్వే నిర్వహిస్తున్నామన్నారు. మిషన్ భగీరథ పైప్‌లైన్, కుళాయిలు దెబ్బతింటే వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు కోసం నివేదిక అందిస్తే దానికి అనుగుణంగా బడ్జెట్ విడుదల అవుతుందని కార్యదర్శి సందీప్ తెలిపారు. మిషన్ భగీరథ నీరు రావడం లేదని ఇళ్ల ఎదుట దిష్టిబొమ్మల్లాగా కులాయిలు ఏర్పాటు చేశారని గ్రామస్తులు ఆగ్రహించారు.

**ఇంటింటా నల్లా సర్వే పరిశీలన**

బాన్సువాడ రూరల్ : ఇంటింటా నల్లా సర్వేలను గురువారం బాన్సువాడ ఎంపీడీవో బషీరుద్దీన్ పరిశీలించి, పంచాయితీ కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. మండలంలోని బోర్లం, బోర్లం క్యాంపు, దేశాయిపేట్ గ్రామాల్లో ఆయన పర్యటించారు. నమోదు చేసిన సర్వే వివరాల ప్రకారమే ప్రభుత్వం శాశ్వత మంచినీటి సమస్య పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటుందన్నారు. జీపీ కార్యదర్శులు ఉన్నారు.

**బీబీపేటలో..**

బీబీపేట : గ్రామంలో ప్రతి ఇంటింటికీ మిషన్ భగీరథ ద్వారా తాగునీటిని అందించడమే లక్ష్యమని జీపీ కార్యదర్శి రమేశ్ అన్నారు. మిషన్ భగీరథ సర్వేలో భాగంగా గురువారం మండల కేంద్రంలో ఇంటింటా సర్వే నిర్వహించారు. గ్రామంలో మొత్తం 2,358 మిషన్ భగీరథ నల్లాలు ఉన్నాయని పది రోజుల సర్వేలో భాగంగా గురువారం నాటికి 453 పూర్తయినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కారోబార్ సిద్దిరాంలు, సిబ్బంది ప్రశాంత్, నర్సింలు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

### సైబర్‌నేరాలపై అవగాహన



పిట్లం(జుక్కల్) : కామారెడ్డి జిల్లా పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంక్, యూనియన్ బ్యాంక్‌లలో సైబర్ నేరాల గురించి అవేర్నెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్సై లింబాద్రి మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి ఓటీపీ అడిగినా చెప్పవద్దని మీకు ఏదైనా సమస్య వస్తే నేరుగా బ్యాంక్‌కు వెళ్లి పరిష్కరించుకోవాలని తదితర విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### కంచె తొలగింపు



ఎల్లారెడ్డి : పట్టణంలోని నాగన్నకుంట దారిలో వేసిన కంచెను ఇరిగేషన్ అధికారులు, పోలీసు సిబ్బందితో కలిసి గురువారం తొలగించినట్లు రైతులు తెలిపారు. పట్టణంలోని పప్పు విశ్వనాథం అనే వ్యక్తి నాగన్నకుంటకు వెళ్లే దారిలో కంచె వేసి రైతులకు అటువైపు వెళ్లకుండా ఇబ్బందులకు గురిచేయడంతో రైతులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్ ఇరిగేషన్ అధికారులకు పోలీసు సహకారంతో కంచెను తొలగించాలని ఆదేశాలు జారీ చేయడంతో ఇరిగేషన్ ఏఈ శ్రీకాంత్, ఎస్సై మహేష్‌తో కలిసి కంచెను తొలగించారు.

## విద్యార్థులకు పుస్తకాల పంపిణీ


సంగంలో పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ


పెద్దమల్లారెడ్డిలో..

భిక్కనూరు : మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలో బాలురు ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు గురువారం పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ప్రసన్నదేవి, ఉపాధ్యాయులు అనిల్, ఎంపీటీసీ సభ్యుడు సాయాగౌడ్ పాల్గొన్నారు.

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండలంలోని సంగం గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో గురువారం ఎంపీపీ పాల్త్య విఠల్ పుస్తకాల పంపిణీ చేశారు. ఆయన వెంట హెచ్ఎం హరి ప్రసాద్, ఉపాధ్యాయులు మౌనిక, విద్యార్థులు ఉన్నారు.

నిజాంసాగర్(జుక్కల్) : మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనం వద్ద గురువారం ప్రభుత్వ పాఠశాలల వారీగా ఉపాధ్యాయులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. 43 ప్రభుత్వ పాఠశాలలకుగాను 1,667 పాఠ్య పుస్తకాలు వచ్చాయని ఎంఐఎస్ కో ఆర్డినేటర్ రాజు తెలిపారు. ఇంకా 1,607 పాఠ్య పుస్తకాలు రావాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీలు శంకర్ గౌడ్, వరలక్ష్మి, వెంకట్రాం గౌడ్, నర్సింలు, శ్రీధర్ తదితరులు ఉన్నారు.


నిజాంసాగర్‌లో..

### పాఠశాల తనిఖీ



బిచ్కుంద(జుక్కల్) : మండలంలో మిషన్‌కల్లాలి, ఖద్గాంలో గురువారం ఎంపీడీవో గోపాల్, ఎంపీవో మహబూబ్ పాఠశాల సందర్శించి మధ్యాహ్న భోజనం, మరుగుదొడ్లు పరిసర ప్రాంతాలు పరిశీలించారు. మరుగుదొడ్లు త్వరలో పూర్తి చేయాలని రుచికరమైన భోజనం పెట్టా లని కాంట్రాక్టర్‌ను సూచించారు. హెల్‌సెంటర్, మిషన్ భగీరథ సర్వేను పరిశీలించారు.

### తాగునీటి సరఫరాపై సర్వే



పెద్దకొడప్‌గల్(జుక్కల్) : మండలంలోని కాటేపల్లిలో గురువారం జీపీ కార్యదర్శితో పాటు సిబ్బంది కలిసి మిషన్ భగీరథ నీళ్ల సరఫరాపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా గడప గడపకు తిరుగుతూ మిషన్ భగీరథ నీళ్లు వస్తున్నాయా లేదా అని అడిగి వివరాలు నమోదు చేసుకున్నారు. ఈ జీపీ కార్యదర్శి ప్రదీప్, సిబ్బంది, జబ్బార్, సాయిలు, భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### ఎమ్మెల్యేను కలిసిన ఇసన్నపల్లి నాయకులు



రామారెడ్డి : ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావును ఇసన్నపల్లి కాంగ్రెస్ నాయకులు గురువారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో కలిశారు. విదేశీ పర్యటనను ముగించుకుని స్వదేశానికి వచ్చిన సందర్భంగా ఎమ్మెల్యేను కలిసినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఇసన్నపల్లి గ్రామాభివృద్ధికి సంబంధించిన అంశాలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చినట్లు తెలిపారు.

### డ్రెయినేజీలు పరిశుభ్రం



నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండలంలోని సంగంలో రెండు రోజుల నుంచి వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో వీధుల్లో మురికి కాల్వల్లో తీమోఫాస్ ద్రావణం పిచికారి చేయించారు. వైద్య పరీక్షలు చేసిన మందులు అందించారు. వాటర్ ట్యాంకులను క్లోరినేషన్ చేయించారు. డా.గిరీష్, సబ్ యూనిట్ అధికారి సుధాకర్, సీహెచ్‌వో రవీందర్, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

### బోరుబావుల తవ్వకం



నిజాంసాగర్(జుక్కల్) : మహమ్మద్ నగర్ మండలంలోని నర్వ గ్రామంలోని పలు కాలనీల్లో తాగునీటి ఎద్దడి నివారణకు గురువారం బీజేపీ నాయకులు గొర్గంటిరాములు, ముప్పిడి రాంప్రసాద్ బోరుబావులు వేయించారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారం సందర్భంగా నర్వ గ్రామంలోని దళిత వాడతో పాటు బీసీ కాలనీలో త్రాగు నీటి సమస్య ఉందని కాలనీ ప్రజలు బీజేపీ నేతల దృష్టికి తీసుకెళ్లగా ప్రస్తుతం బోర్లు వేయించారు. మాజీ ఎంపీ బీబీపాటిల్ నిధులతో రెండు చోట్ల బోర్లు వేయించామన్నారు.

### సమస్యలను పరిష్కరించాలి



కామారెడ్డి టౌన్ : పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ అధికారులకు ఆదేశించారు. గురువారం కౌన్సిల్ హాల్‌లో అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. నీటి సమస్యను పరిష్కరించేందుకు వాటర్ ట్యాంకర్‌ల ద్వారా సరఫరా చేయాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో మురికి కాలువల సమస్యలు తలేత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుజాత, వైస్ చైర్‌పర్సన్ వనిత, అధికారులు పాల్గొన్నారు.

### మున్సిపల్ కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలి



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : మున్సిపల్‌లో పనిచేసే కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని బీఎల్‌టీయూ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మున్సిపల్ మేనేజర్ వాసంతిని బీఎల్‌టీయూ నాయకులు వెంకట్ కలిసి వినతిపత్రం సమర్పించారు.

### అటవీ సంరక్షణ, చట్టాలపై అవగాహన సదస్సు

రాజంపేట : రాజంపేట మండలం షేర్ శంకర్ తండా జీపీ పరిధిలో గురువారం డీఎస్పీ నాగేశ్వరరావు, అటవీశాఖ అధికారుల ఆధ్వర్యంలో అటవీ సంరక్షణ చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ నాగేశ్వరరావు మాట్లాడుతూ అడవుల సంరక్షణ అందరి బాధ్యత అని ఎదుట తరాలకు స్వచ్ఛమైన గాలినీరు అందించాలన్నారు. సీఐ సంపత్ కుమార్ మాట్లాడుతూ ఎవరైనా చట్టాలను ఉల్లంఘిస్తే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఫారెస్ట్ రేంజ్ అధికారి రమేష్ మాట్లాడుతూ చెట్లను నరకడం అటవీ భూములు దున్నడం చట్టరీత్యా నేరమన్నారు. ఈ కార్యక్రమంలోఎంపీడీవో కె రాజేశం,ఎస్సై సంపత్ కుమార్, ఏపీవో సక్కుబాయి, ఆర్ఐ సంతోష్, జెడ్పీటీసీ కొండ హన్మాండ్లు, మాజీ ఎంపీటీసీ శంకర్, మాజీ సర్పంచ్ శంకర్ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## సంక్షిప్తం

### పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి



బిచ్కుంద(జుక్కల్) : అన్ని వర్గాల ప్రజలు ప్రశాంతంగా పండగలు జరుపుకోవాలని ఎస్సై మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం పోలీస్ స్టేషన్‌లో రాజకీయ పార్టీలు, ఆయా కుల సంఘాల మత పెద్దలతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ బక్రీద్ పండగ వస్తున్న సందర్భంగా ఎలాంటి సంఘటనలు జరుగకుండా అందరు కలిసిమెలిసి ఉండి పండుగలు జరుపుకోవాలని సూచించారు.

### ప్రమాద బీమాను సద్వినియోగం చేసుకోవాలి

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : పోస్టాఫీస్ కార్యాలయంలో ప్రవేశపెట్టిన ప్రమాద బీమా, హెల్త్ ఇన్సూరెన్స్ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పోస్టాఫీస్ సిబ్బంది తెలిపారు. 18 ఏళ్ల నుంచి 65ఏళ్లలోపు ఉన్నవారు మాత్రమే ఈ బీమా చేసుకోవాలన్నారు. ఏడాదికి రూ. 750 చొప్పున చెల్లించినట్లయితే రూ. 15లక్షల బీమా వర్తిస్తుందన్నారు. ఏడాదికి రూ. 555 చెల్లించినట్లయితే రూ. 10 లక్షల బీమా వర్తిస్తుందన్నారు. పూర్తి వివరాల కోసం దగ్గరలో ఉన్న పోస్టాఫీస్ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు. ఇప్పటికే గ్రామాల్లో తిరిగి ప్రచారం చేయడం జరిగిందన్నారు.

**బీబీపేటలో..**

బీబీపేట : ప్రతివ్యక్తికి ప్రమాద బీమా అవసరమని గురువారం మండల కేంద్రంలో పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా 18ఏళ్ల నుంచి 65ఏళ్ల వరకు ఉన్నటువంటి వారు ఖచ్చితంగా ప్రమాద బీమా చేయించుకోవాలని తెలిపారు. జీపీ కార్యాలయంలో ప్రజలకు పాలసీలను చేశారు. ఎంవో వెంకటరాంరెడ్డి ఎస్‌పీఎం నర్సింలు, బీపీఎం వికాస్, అనిల్, శ్రీలత పాల్గొన్నారు.

### రోడ్డుపై ఇష్టారాజ్యంగా ఆటోలు



మద్నూర్(జుక్కల్) : మండల కేంద్రంలోని పాతబస్టాండ్ ప్రాంతంలో నిత్యం ట్రాఫిక్‌తో రద్దీగా ఉండే సమయంలో ఆ టోలు రోడ్లపై అడ్డదిడ్డంగా నిలపడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మద్నూర్ పాత బస్టాండ్ ప్రాంతంలోనే వ్యాపార సముదాయాలు, ఇతర గ్రామాలకు వెళ్లే ఆటోలు, ఆర్టీసీ బస్సుల కోసం ప్రయాణికులు అందరు ఒకే చోట ఉండడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాలకు వెళ్లే ఆటోలు ప్రయాణికుల కోసం పోటీ పడుతూ రోడ్లపైకి వస్తుండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని గ్రామస్తులు పేర్కొంటున్నారు. పోలీసు సిబ్బంది స్పందించి ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.